ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 05-08-2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు జస్టిస్ పీసీ ఘోష్ నివేదికలో రుజువయ్యాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.
2. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ అందించిన నివేదికను పూర్తిగా బయటపెట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు.
3. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ పార్టీ, బీసీ సంఘాలు రేపు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నాయి.
4. రాష్ట్రంలో వచ్చే అయిదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇందిరమ్మ ఇళ్లు - పొంగులేటి

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఎన్నో అక్రమాలకు పాల్పడిందని, కాళేశ్వరం అవినీతి కుంభకోణాన్ని తమ ప్రభుత్వం బయటపెట్టిందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. రైతు వేదిక వద్ద నూతన రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15 నెలల విచారణ తర్వాత జస్టిస్ పీసి ఘోష్ 665 పేజీల నివేదిక ఇచ్చారని, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు అవకతవకలు అందులో రుజువయ్యాయని పేర్కొన్నారు. అలాగే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

పీటీసీ, ఖమ్మం

**హరీశ్ రావు – పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

కాళేశ్వరం కమిషన్ అందించిన నివేదికను పూర్తిగా బయటపెట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఈ రోజు తెలంగాణ భవన్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీశ్ రావు కమిషన్ వక్రీకరణలు – అవాస్తవాలు పేరుతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. గత 20 నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కన పెట్టి రాజకీయ కక్ష్య సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతులకు యూరియా లభించడం లేదని, విద్యార్థులు రీయంబర్స్మెంట్ కోసం, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కమిషన్ల ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. ఈ ప్రజంటేషన్ కొనసాగుతోంది.

డెస్క్

కాంగ్రెస్ ధర్నా

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ పార్టీ, బీసీ సంఘాలు రేపు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నాయి. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు మొత్తం మూడు రోజుల పాటు ఈ ధర్నా కొనసాగుతుంది.

ఈ ధర్నాలో పాల్గొనేందుకు ఇప్పటికే టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు.

డెస్క్

వాయిదా తీర్మానం

మరో వైపు బీసీ రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం ఇచ్చారు. లోక్ సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే అంశంపై చర్చించాలని వాయిదా తీర్మానం ఇచ్చారు. అంతకు ముందు బీసీ రిజర్వేషన్లను ఆమోదించాలని డిమాండ్ చేస్తూ.. పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపీలు ధర్నా చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.

డెస్క్

కేబుల్ ఎక్స్ పో

హైదరాబాద్ హైటెక్స్ వేదికగా 13వ కేబుల్ నెట్ కవర్జెన్స్ ఎక్స్ పో ఈ రోజు ప్రారంభం కానుంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ రోజు నుంచి 3 రోజుల పాటు జరిగే ఎక్స్ పోలో ఎగ్జిబిషన్, ప్రత్యేక సెమినార్లు నిర్వహిస్తారు. సీసీ కెమెరా, క్లౌడ్ నెట్ వర్క్, OTT ప్లాట్ ఫామ్స్, IPTV టెక్నాలజీకి సంబంధించి ప్రత్యేకంగా సెమినార్లు ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. 200 కి పైగా స్టాల్స్ లో 350కి బ్రాండ్స్ ను ప్రదర్శిస్తారు.

డెస్క్

TELANGANA ASSEMBLY

అసెంబ్లీలో చర్చించిన తర్వాత, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించారు. ఈ కమిషన్ బహుళ కోట్ల ప్రాజెక్టు

ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ దశలలో జరిగిన లోపాలపై మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి టి. హరీష్ రావు పాత్ర ఉన్నట్లు కమిషన్ నివేదికలో పేర్కొంది.

ఎంఎస్ఎల్

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ airnews_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

హర్ ఘర్ తిరంగా

ప్రజల్లో దేశభక్తిని, సోదరభావాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా అనే కార్యక్రమాన్ని 2022 లో ప్రారంభించింది. అప్పటినుండి నేటి వరకు స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ప్రతి ఇంటిపై జాతీయ జెండాని ఎగుర వేసే ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంపై కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పిజీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ తన అభిప్రాయాలను ఆకాశవాణితో పంచుకున్నారు.

**(బైట్ : ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ)**

అలాగే సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గాజుల రవీందర్ తన అభిప్రాయాన్ని పంచుకుంటూ..

**(బైట్: ఉపాధ్యాయులు గాజుల రవీందర్)**

పిటిసి కరీంనగర్

గురుకుల పాఠశాల- ఆహారం కలుషితం

ఆసిఫాబాద్ జిల్లాలో రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిన్న నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై కలెక్టర్ వెంకటేష్ దోత్రే విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెబ్బెన ఎంపీడీవో శంకరమ్మ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య, విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్ కు పంపనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

జి.మహేష్ ఆసిఫాబాద్ జిల్లా పిటిసి

డీవార్మింగ్

చిన్న పిల్లలలో బలహీనత, రక్తహీనత, ఆకలి లేకపోవడం వంటి సమస్యలకు కారణమయ్యే నులిపురుగులను నివారించడానికి అల్బెండజోల్ మాత్రలు అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. జిల్లా కలెక్టరేట్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 11 న "జాతీయ డీవార్మింగ్ డే" నిర్వహిస్తుందని, ఆరోజున అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో, రెసిడెన్సీయల్ హాస్టల్లో ఉన్న ప్రతి చిన్నారికి అల్బెండజోల్ టాబ్లెట్లు అందించాలన్నారు.

జి రామకృష్ణ, పీటీసీ నల్లగొండ జిల్లా

వాతావరణం

రాష్ట్రంలో వచ్చే అయిదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ రోజు అన్ని జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. కాగా రేపు నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. వచ్చే అయిదు రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

పీఎన్

తల్లిపాల వారోత్సవాలు

ప్రతి అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ఈ నెల 7 వరకు అవగాహన కల్పిస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం చెప్పారు. ఈ సందర్భంగా ఆకాశవాణితో మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యత వివరించడానికి ప్రత్యేకత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**(బైట్: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం)**

పీటీసీ రాజన్న సిరిసిల్ల

ఉద్యాన పంటలు

రైతులు ప్రత్యామ్నాయ పంటలుగా ఉద్యానవన పంటల సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు అధిక లాభాలు పొందవచ్చని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయ నిర్మల అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి ఆకాశవాణితో మాట్లాడుతూ...

**(బైట్: మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయ నిర్మల)**

మహబూబాబాద్ జిల్లా, పి.టి.సి.

**CLOSING**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.